AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND


www.aksharatoday.in

17-10-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

వామ్మో రోడ్లు..



2



2

ప్రైవేట్ డీలర్లకు చేరుతున్న సొసైటీ బియ్యం!

నూతన చట్టాలపై పీపీలకు అవగాహన



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : జిల్లా కోర్టులో పీపీలకు నూతన చట్టాలపై శనివారం మలక్ పేట్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ రజిని ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ఆర్గనైజింగ్ కేసుల గురించి క్లుప్తంగా వివరించారు. బీఎన్ఎస్ చట్టం గురించి, భారత ప్రభుత్వ హోం వ్యవహారాల శాఖా మంత్రి జారీ చేసిన వ్యక్తుల అక్రమ రవాణా నిరోధకం గురించి చర్చించారు. మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి చట్టాలను సాంకేతికంగా ఎలా ఉపయోగించాలో ఆమె వివరించారు.



భిక్షాటనతో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన

అక్షరటుడే, కామారెడ్డి: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో జాతీయ ఆరోగ్య మిషన్‌లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల నిరవధిక సమ్మె 5వ రోజుకు చేరింది. ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ఉద్యోగులంతా భిక్షాటన నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు, సైంటిస్ట్ డా. పైడి ఎల్లారెడ్డి, ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు దీక్షా శిబిరాన్ని సందర్శించారు. అలాగే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కాసర్ల గోదావరి, టీఎస్పీఎస్సీ మాజీ సభ్యురాలు, బీఆర్ఎస్ నాయకురాలు సుమిత్రానంద్ దీక్షలో ఉన్న వారికి సంఘీభావం తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని, ఫ్రంట్‌లైన్ వారియర్లుగా ఉన్న వైద్య సిబ్బంది బాధలను అర్థం చేసుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి సుమన్, ప్రధాన కార్యదర్శి బట్టు పద్మజ, గౌరవ అధ్యక్షుడు మారుతి, వర్కింగ్ ప్రెసిడెంట్ హరీష్, చైతన్య, రాజశేఖర్, వెంకట్ స్వామి, వేణు మాధవ్, రాహుల్, రాజు, సందీప్, అశ్విని, మౌనిక, శ్యాం తదితరులు పాల్గొన్నారు.



కరెన్సీ నోట్లతో దుర్గామాతకు అలంకరణ

అక్షరటుడే, భీమ్‌గల్: మండలంలోని బడాభీమ్‌గల్ గ్రామంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. గ్రామ పరిధిలోని దుర్గా భవానీ ఉత్సవ కమిటీ, యువ చైతన్య యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం ఆధ్యాత్మిక శోభతో విలసిల్లుతోంది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం దుర్గామాతను రూ. 5 లక్షల కరెన్సీ నోట్లతో అత్యంత ఆకర్షణీయంగా అలంకరించారు. మండపంలో అమ్మవారికి కుంకుమార్చనలు, సహస్రనామార్చన, లలితా సహస్రనామ పారాయణలు, విశేష ధూపదీప నైవేద్యాలు, మహా హారతి వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల నిర్వాహకులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయగా, పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేపట్టారు.



బాధ్యతాయుతంగా ఆధార్ సేవలు నిర్వహించాలి : కలెక్టర్

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : ప్రజలకు బాధ్యతాయుతంగా ఆధార్ సేవలను అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నగరంలోని వర్నీరోడ్‌లోని కోటగల్లీ మున్నూరుకాపు సంఘం భవనంలో ఆధార్ సేవలను ప్రారంభించారు. రాష్ట్రంలో హైదరాబాద్‌లో ఆధార్ ప్రత్యేక సేవలను ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆధార్ కేంద్రం ద్వారా ప్రజలకు నాణ్యతగా బాధ్యతాయుతమైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రజలు, వృద్ధులు, మహిళలు విద్యార్థులు, గ్రామీణ ప్రాంతాల వారికి ఓపికగా ఈ సేవలందించాలని సూచించారు. ఎవరైనా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో నకిలీ ఆధార్ నమోదుకు ప్రయత్నించినప్పుడు గుర్తించి తన దృష్టికి తీసుకురావాలన్నారు. అలాంటి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిరోజూ ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఆధార్ కేంద్రం పని చేస్తుందన్నారు. ఆదివారం, రెండో శనివారం తదితర పండగల సెలవు దినాల్లో కూడా ఆధార్ కేంద్రం పనిచేస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యుఐడీఏఐ అసిస్టెంట్ మేనేజర్ శ్రావణ్ కుమార్, ఈ గవర్నెన్స్ జిల్లా మేనేజర్ కార్తీక్ కుమార్, ప్రోటీన్ టెక్నాలజీస్ సంస్థ నిజామాబాద్ ఆధార్ సేవాకేంద్రం మేనేజర్ సురేష్ కుమార్, ఏఎస్‌కే కామారెడ్డి జిల్లా మేనేజర్ అనిల్ కుమార్, ఆధార్ కేంద్రం ఉద్యోగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఏటీఎం చోరీ నిందితుల కోసం వేట..

- గాంధారి ఏటీఎం చోరీని సీరియస్‌గా తీసుకున్న పోలీసు శాఖ
- ఇప్పటికే పలువురు పోలీస్ సిబ్బంది సస్పెండ్.. ఛార్జి మెమో జారీ
- విచారణ కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు
- సీసీ కెమెరాల ఆధారంగా నిందితుల గుర్తింపు
- ఇతర రాష్ట్రాలకు జిల్లా పోలీసు బృందాలు!

గాంధారి ఏటీఎం చోరీ జిల్లాలో కలకలం సృష్టించింది. ముఖ్యంగా పోలీసు అధికారుల పనితీరును వేలెత్తి చూపేలా చోరీ జరిగిందన్న ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో చోరీ కేసును జిల్లా ఎస్పీ సీరియస్‌గా తీసుకున్నారు. ఇప్పటికే విధుల్లో నిర్లక్ష్యం వహించిన నలుగురు హోంగార్డులపై సస్పెన్షన్ వేటు వేయడంతో పాటు ఓ ఏఎస్సై, కానిస్టేబుళ్లకు ఛార్జి మెమోలు సైతం జారీ చేశారు. అలాగే విచారణకు సైతం పలు బృందాల్లో ఇతర రాష్ట్రాల్లో సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి.

- అక్షరటుడే, కామారెడ్డి

ఏటీఎం చోరీ అనంతరం జిల్లా ఎస్పీ ఆదేశాలతో పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. స్థానికంగా ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించిన పోలీసులు ఒక నిర్ధారణకు వచ్చినట్లుగా తెలుస్తోంది. సీసీ పుటేజీ ఆధారంగా విచారణ కోసం ఎస్పీ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఆ బృందాలు నిందితుల వేటలో ఉన్నట్లుగా తెలుస్తోంది.

సస్పెన్షన్, ఛార్జి మెమోలు

ఏటీఎం చోరీ సమయంలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన నలుగురు హోంగార్డులపై సస్పెన్షన్ వేటు వేయడంతో పాటు ఓ ఏఎస్సై, కానిస్టేబుళ్లకు ఛార్జీమెమోలు సైతం జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని సిబ్బందిపై చర్యలతో మరోసారి తీవ్ర హెచ్చరిక జారీ చేసినట్లుగా పోలీస్ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ చర్యలతో జిల్లాలోని పోలీస్ సిబ్బందిలో ఒక్కసారిగా కలకలం రేగింది. చోరీ కేసు విచారణ పూర్తయ్యే వరకు మరికొందరిపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం.

ప్రత్యేక బృందాల ఏర్పాటు

ఏటీఎం చోరీ అనంతరం ఎస్పీ ఆదేశాలతో పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. విచారణ వేగవంతం చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఒక్కో బృందానికి ఒక్కో పనిని అప్పగించారని, సీసీ పుటేజీల పరిశీలన, అనుమానితుల గుర్తింపు, పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు తెలుస్తోంది. నిందితుల కోసం బీహార్, రాజస్థాన్ రాష్ట్రాలకు ప్రత్యేక బృందాలు వెళ్లినట్లుగా విశ్వసనీయ సమాచారం.

సీసీ కెమెరాల ఆధారంగా..

చోరీ జరిగిన సమయంలో స్థానికంగా ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించిన పోలీసులు ఒక నిర్ధారణకు వచ్చినట్టుగా తెలుస్తోంది. ఏటీఎం సమీపంలోని దుకాణాలు, ప్రధాన రహదారిపై ఉన్న కెమెరాల్లో నిందితులు కదలికలు రికార్డ్ అయినట్టు సమాచారం. వారు వచ్చిన వాహనం, దాని నంబర్ ప్లేట్, వారు ధరించిన దుస్తులు, ముఖాలు వంటి ఆధారాలను పోలీసులు సేకరించినట్టు తెలుస్తోంది.

ఇతర రాష్ట్రాలకు..

చోరీ చేసిన నిందితులు ఇతర రాష్ట్రాలకు పారిపోయి ఉండే అవకాశం ఉండటంతో జిల్లా పోలీసు బృందాలు ఇతర రాష్ట్రాలకు వెళ్లి గాలిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా పొరుగు రాష్ట్రాల్లోని అనుమానిత ప్రాంతాల్లో గాలిస్తున్నారని, అక్కడి పోలీసులతో సమన్వయం చేసుకుని విచారణ జరుపుతున్నారని తెలుస్తోంది. గతంలో ఇలాంటి ఏటీఎం చోరీల్లో పాల్గొన్న ముఠా పనేనా అనే కోణంలోనూ విచారణ జరుగుతోందని చెబుతున్నారు.

త్వరలో కేసును కొలిక్కి తెచ్చే అవకాశాలు

ప్రస్తుతం పోలీసులకు కీలక ఆధారాలు దొరికినట్టుగా తెలుస్తోంది. నిందితుల వేటలో ఉన్న బృందాలు త్వరలోనే వారిని పట్టుకునే అవకాశం ఉందని పోలీస్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. చోరీ జరిగిన తీరు, నిందితులు తప్పించుకునే మార్గం వంటి అంశాలపై పూర్తి స్పష్టత వచ్చిందని, కేసును త్వరలోనే కొలిక్కి తెచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నట్టు సమాచారం. నిందితులను పట్టుకుంటేనే పోలీసులపై వచ్చిన ఆరోపణలు తొలగిపోతాయని పోలీస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



ఆర్మూర్ పెద్దమ్మతల్లి ఆలయంలో హోమం

అక్షరటుడే, ఆర్మూర్: పట్టణంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో హోమం నిర్వహించారు. దుర్గామాత ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సద్దుల బతుకమ్మ వేడుకల్లో పోచారం..



అక్షరటుడే, బాన్సువాడ: మండలంలోని పోచారం గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలు శనివారంఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సంబరాల్లో పాల్గొన్నారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి వాటిని ఒక్కచోట ఉంచి ఆడిపాడారు.



దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నాం : షబ్బీర్ అలీ

అక్షరటుడే, కామారెడ్డి: ఐదేళ్ల తర్వాత ఇందిరాగాంధీ స్టేడియంలో దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నట్లు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. శనివారం ఆయన స్టేడియంలో జరుగుతున్న దసరా ఉత్సవ పనులను పరిశీలించారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం దసరా ఉత్సవ కమిటీ నిర్వాహకులు వీటీ ఠాకూర్ ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయన్నారు. 1990లో తాను మంత్రిగా ఉన్నప్పుడు మొదటిసారి ఉత్సవాలను ప్రారంభించానన్నారు. ఆ తర్వాత షబ్బీర్ అలీ ఫౌండేషన్, దసరా ఉత్సవ కమిటీ సంయుక్తంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్ల క్రితం కరోనా కారణంగా ఉత్సవాలు నిలిచిపోయాయని, ఉత్సవాల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ సంవత్సరం స్టేడియంలో అంగరంగ వైభవంగా ఉత్సవాలకు ఏర్పాటు చేస్తున్నామని, అబ్బురపరిచే విధంగా లేజర్ షో ఉంటుందన్నారు. గత కొన్నాళ్లుగా స్టేడియంలో వసతులు అధ్వానంగా తయారయ్యాయని, రూ.15 లక్షల వ్యయంతో మరమ్మతులు చేశామని షబ్బీర్ అలీ తెలిపారు. ఎంఎస్ఎన్ కంపెనీ సహకారంతో సీఎస్ఆర్ నిధులు కలిపి దాదాపు రూ.కోటి వ్యయంతో స్టేడియంలో ఫ్లడ్ లైట్స్, ఇతర వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలతో పాటు ఇతర నాయకులకు ఆహ్వానిస్తామని చెప్పారు. వీటీ రాజ్ కుమార్, అదనపు కలెక్టర్ గిరి, డీఎస్పీ మధుసూదన్, జిల్లా స్పోర్ట్స్ అధికారి వెంకట్, డీఎంఅండ్‌హెచ్‌వో వెంకట్ పాల్గొన్నారు.

కాళేశ్వరంపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదు..

అక్షరటుడే, కామారెడ్డి: ప్రభుత్వానికి కాళేశ్వరంపై విమర్శలు చేయడంపై ఉన్న శ్రద్ధ రైతులకు కరెంట్ సరఫరా చేయడంలో లేదని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి విమర్శించారు. శనివారం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కామారెడ్డి విద్యుత్ కార్యాలయం ఎదుట విద్యుత్ కోతలపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కేవీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ముందు చూపు లేకనే విద్యుత్ కోతలని విమర్శించారు. ఎల్‌నినో వల్ల సమస్య ఉంటుందని ఆర్నెళ్ల క్రితమే తెలిసినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. గత ప్రభుత్వాన్ని విమర్శించడంపై ఉన్న శ్రద్ధ రైతుల సమస్యల పరిష్కారంపై పెట్టడం లేదని ఎద్దేవా చేశారు. ప్రస్తుత పంటకు నీళ్లు ఇవ్వాలని, యాసంగి పంటకి ప్రణాళిక తయారు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే తాగునీటికి కూడా ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందన్నారు.



జీజీహెచ్‌లో 'బేటీ జన్మోత్సవ్' కార్యక్రమం



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : మహిళా శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల, ట్రాన్స్ జెండర్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని జీజీహెచ్‌లో బేటీ జన్మోత్సవ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీజీహెచ్‌లో సాధారణ ప్రసవం ద్వారా ఆడపిల్లలకు జన్మనిచ్చిన తల్లులకు డీఎంహెచ్‌వో రాజశ్రీ, జిల్లా సంక్షేమ అధికారి సౌందర్య, అర్బన్ సీడీపీవో విజయలక్ష్మి, డాక్టర్ అరుణ రేఖ, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ స్వప్న బేబీ ప్రొడక్ట్స్ కిట్లను అందించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి సౌందర్య మాట్లాడుతూ ఆడపిల్లల జననాన్ని ప్రోత్సహించడం, బాలికల పట్ల వివక్షను తొలగించడం, వారి విద్య, ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిచ్‌పల్లి ప్రాజెక్టు సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, బుజ్జి, శోభ, వినోద, వైద్యాధికారులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కుష్ఠు వ్యాధి సర్వేపై శిక్షణ

అక్షరటుడే, ఆర్మూర్: మండలంలోని గోవింద్ పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వేపై శిక్షణ శిబిరాన్ని శనివారం నిర్వహించారు. వైద్యాధికారి మానస మాట్లాడుతూ.. చెమట లేని రాగి రంగు ఉన్న మచ్చలు గల వారిని అనుమానిత కుష్ఠు వ్యాధిగ్రస్తులుగా గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపాలని సూచించారు. అక్టోబర్ 22వ తేదీ నుండి 14 రోజుల పాటు సాగే ఈ సర్వే కార్యక్రమానికి ప్రజలు అందరు సహకరించాలని కోరారు. ఆరోగ్య విస్తరణ అధికారి వై. శంకర్ మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి 'మైక్రో బాక్టీరియం లెప్రయి' అనే బ్యాక్టీరియా ద్వారా వస్తుందన్నారు. ప్రారంభ దిశలో గుర్తించితే పూర్తిగా నయమయ్యే వ్యాధి కావున ప్రజలు సహకరించాలని కోరారు. అనుమానిత కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే కార్యక్రమాన్ని ఆశా కార్యకర్తలు అందరూ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణఅధికారి వై.శంకర్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కాపురానికి రావట్లేదని భార్యపై దాడి..

అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: కాపురానికి రావట్లేదని ఓ వ్యక్తి భార్యపై దాడి చేశాడు. అంతేకాదు మామపై కూడా దాడికి తెగబడ్డాడు. ఈ ఘటన నగరంలోని వినాయక్‌నగర్ లో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. నాల్గో టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన మధుకర్‌కు నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన మహిళతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. అయితే కుటుంబ కలహాల నేపథ్యంలో ఆమె తిరిగి వినాయక్‌నగర్ లోని తన పుట్టింట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో శుక్రవారం ఆమె ఇంటికి వచ్చిన భర్త మధుకర్ కాపురానికి రావాలని కోరగా ఆమె నిరాకరించింది. దీంతో కోపోద్రిక్తుడైన మధుకర్ కత్తితో భార్య, మామపై విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో ఇరువురికి గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు వారిని జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న నాల్గో టౌన్ ఎస్‌హెచ్‌వో సతీష్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రస్తుతం మామ పరిస్థితి విషమంగా ఉందని సమాచారం.

సీనియర్ పాత్రికేయుడు యండమూరి వరప్రసాద్ కన్నుమూత



అక్షరటుడే, బాన్సువాడ: బాన్సువాడ కు చెందిన సీనియర్ పాత్రికేయులు యండమూరి వరప్రసాద్ కన్నుమూశారు. అనారోగ్యంతో శనివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మృతి చెందడం మృతి పాత్రికేయ రంగంలో తీవ్ర విషాదాన్ని నింపింది. యండమూరి వరప్రసాద్ గతంలో సాక్షి, ఆంధ్రజ్యోతి, సూర్య తదితర ప్రముఖ దినపత్రికల్లో పనిచేసి జర్నలిజం రంగంలో తనదైన ముద్ర వేశారు. వృత్తిపట్ల అంకితభావంతో పనిచేస్తూ, నిష్పక్షపాతంగా, నిర్భయంగా వార్తలను ప్రజలకు అందించడంలో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలోనూ, వాస్తవాలను ప్రజల ముందుంచడంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. దీర్ఘకాలంగా పాత్రికేయ రంగంలో సేవలందించిన వరప్రసాద్ మృతి బాన్సువాడ ప్రాంత పాత్రికేయ లోకానికి తీరని లోటని పలువురు జర్నలిస్టులు, ప్రముఖులు పేర్కొన్నారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ సంతాపం వ్యక్తం చేశారు. యండమూరి వరప్రసాద్ మృతి పట్ల పాత్రికేయులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

కామారెడ్డి పట్టణంలో రహదారుల పరిస్థితి అధ్వానంగా మారింది. పట్టణంలో ఏ మూలకు వెళ్లినా గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయి. పట్టణాభివృద్ధి ప్రణాళికపై అధికారుల అలసత్వం, నాయకుల పట్టింపులేని తనం స్పష్టంగా కనిపిస్తోందని ప్రజలు ఆ రోడ్లపై వెళ్లినప్పడల్లా తిట్టుకోవడం పరిపాటిగా మారింది. అయినా అధికారులకు, నాయకులకు చీమకుట్టినట్టుగా కూడా అనిపించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.
- అక్షరటుడే, కామారెడ్డి



వామ్మో రోడ్లు..

■ గుంతలుగా మారిన పట్టణ ప్రధాన రహదారులు ■ శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళిక కరువు
■ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం.. వర్షం పడితే ఇళ్లలోకి నీళ్లు ■ ఇబ్బందులు పడుతున్న ప్రజలు

జిల్లా కేంద్రంగా ఏర్పడి పదేళ్లు దాటినా కామారెడ్డి రూపురేఖలు మారలేదు. పట్టణ అభివృద్ధి పేరుతో ఏటా రూ.కోట్లల్లో ఖర్చు చేస్తున్నట్లు కాగితాలపై లెక్కలు చెబుతున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో మాత్రం అభివృద్ధి శూన్యం. వచ్చిన నిధులు ఏమవుతున్నాయన్న ప్రశ్న ప్రతి ఒక్కరిలో తలెత్తుతోంది. గత ప్రభుత్వ హయాంలో కొన్ని రోడ్లకు నిధులు మంజూరైనప్పటికీ ఎన్నికలు రావడంతో ఆ నిధులు అటకెక్కాయన్న ప్రచారం సాగుతోంది. ప్రస్తుత ప్రభుత్వం కూడా కొత్త ప్రతిపాదనలు పంపుతోందే తప్ప, పాత రోడ్లకు మరమ్మతులు చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రధాన రహదారులపై గుంతలు..

పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ పూర్తిగా ధ్వంసమయ్యాయి. బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు, దేవునిపల్లి రోడ్డు, గాంధీగంజ్, సిరిసిల్ల రోడ్డు, జన్మభూమి రోడ్డు, ఎన్జీవోస్ కాలనీ రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. నిత్యం వందలాది వాహనాలు, వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగించే ఈ రోడ్లపై మోకాలు లోతు గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు ఎక్కడ, గుంత ఎక్కడో తెలియని పరిస్థితి. ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. ఆటోలు బోల్తా పడుతున్నాయి. రాత్రి వేళల్లో వీధి దీపాలు కూడా సరిగా లేకపోవడంతో ప్రమాదాల తీవ్రత మరింత పెరుగుతోంది. కలెక్టరేట్ కు వెళ్లే ప్రధాన రహదారే ఇలా ఉంటే ఇక లోపలి కాలనీ రోడ్ల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు.



ప్యాచ్ వర్క్.. ప్యాచ్ వర్క్..

గుంతలు పడిన ప్రతిసారి అధికారులు చేసేది ఒక్కటే మట్టి, కంకరతో ప్యాచ్ వర్క్. ఒక్క భారీ వర్షానికే ఆ ప్యాచ్ వర్క్ మొత్తం కొట్టుకుపోయి మళ్లీ మొదటికి వస్తోంది. శాశ్వతంగా సీసీ రోడ్లు, నాణ్యమైన బీటీ రోడ్లు వేయాలన్న ఆలోచన అధికారులకు లేకపోవడం శోచనీయం. మున్సిపాలిటీ చేస్తోందని ఆర్అండ్‌బీ, ఆర్అండ్‌బీ చేస్తోందని మున్సిపాలిటీ చెప్పుకుంటూ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నాయి. ఇద్దరి మధ్య సమన్వయం లేక పనులు నత్తనడకన సాగుతున్నాయి. టెండర్లు వేయడం, రద్దు చేయడం తప్ప పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.

అటకెక్కిన రోడ్ల వెడల్పు

కామారెడ్డి పట్టణంలో రహదారుల విస్తరణ చేపట్టాల్సి ఉంది. ఇదే అంశంపై గతంలో పొలిటికల్ వార్ కూడా కొనసాగింది. ప్రస్తుత ఎమ్మెల్యే, మాజీ మున్సిపల్ ఛైర్మన్ తండ్రి రహదారులు ఆక్రమించి ఇల్లు నిర్మించుకున్నారని, జేసీబీలతో ఇళ్లను కూల్చడానికి సవాల్ విసురుకున్నారు. ఈ వివాదం అప్పట్లో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. అనంతరం ఆ వివాదం సద్దుమణగగా రహదారుల విస్తరణ అంశం కూడా పక్కదారి పట్టింది. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ముందు తన ఇంటిని కూల్చేసి రోడ్డు విస్తరణ పనులు తన ఇంటి నుంచే ప్రారంభిస్తానని ప్రకటించడంతో పాటు ఇంటిని కూడా కూల్చేశారు. అయితే విస్తరణ మాత్రం జరగలేదు. పట్టణంలో రహదారుల విస్తరణ చేపడితే రోడ్లపైకి వచ్చిన అనేక ఇళ్లను కూల్చాల్సిన అనివార్య పరిస్థితులు ఏర్పడతాయి. రాజకీయంగా ఈ అంశం పలు పార్టీలకు ఇబ్బందికరంగా మారతాయని భావించి రహదారుల వెడల్పు జోలికి వెళ్లడం లేదన్న ప్రచారం సాగుతోంది.

డైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం..

రోడ్లు ధ్వంసం కావడానికి ప్రధాన కారణం డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా విఫలం కావడమే. పట్టణంలో డ్రైనేజీల్లో ఏళ్లుగా పూడికతీత పనులు చేయడం లేదు. ప్రధాన నాలాలు కబ్జాలకు గురై కుంచించుకుపోయాయి. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరు వెళ్లే మార్గం లేక రోడ్లపైనే నిలిచిపోతోంది. మురుగునీరు, వర్షపు నీరు కలిసి రోడ్లపై చెరువులను తలపిస్తున్నాయి. ఆ నీరే నేరుగా పక్కనే ఉన్న ఇళ్లలోకి, దుకాణాల్లోకి చేరుతోంది.



పోచంపాడ్‌లో దుర్గామాత పల్లకీ సేవ

అక్షరటుడే, పోచంపాడ్: పోచంపాడ్ గ్రామంలోని మహంకాళి దుర్గామాత శిశుమందిర్ ఆధ్వర్యంలో మహంకాళి దుర్గామాత అమ్మవారి పల్లకీ సేవా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించిన అనంతరం పల్లకీ సేవ చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన భక్తులు, మహిళలు, సాములు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బాలాగౌడ్, సాయిరాం, నవీన్ గౌడ్, చందు, విజయ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ ఉద్యోగుల సమైక్య జిల్లా కమిటీ ఎన్నిక

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: మాదిగ ఉద్యోగుల సమైక్య జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. నగరం లోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షుడిగా సైదు లక్ష్మణ్ , ప్రధాన కార్యదర్శిగా జి. సాయిలు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.మారుతి, కోశాధికారిగా బి.సహదేవ్, అడిషనల్ జనరల్ సెక్రెటరీ నాగనాథ్ ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాదిగ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు చేపర్తి యాదగిరి, విశిష్ట అతిథులుగా ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు సిలుమాల సురేష్, మాదిగ ఉద్యోగుల సమైక్య జాతీయ కోర్ కమిటీ సభ్యులు రేణిగుంట నాంపల్లి, తెడ్డు గంగారం, స్టేట్ ఆర్గనైసింగ్ సెక్రెటరి మారుతి పాల్గొన్నారు.



వెంచిర్యాలలో గ్రామంలో స్టీల్ ప్లేట్ల పంపిణీ



అక్షరటుడే, ముప్కాల్: ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించాలనే లక్ష్యంతో ముప్కాల్ మండలం వెంచిర్యాల జీపీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా శనివారం గ్రామంలోని దుర్గాదేవి మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో స్టీల్ ప్లేట్లను పంపిణీ చేశారు. ఎంపీడీవో బి. రమేష్, సర్పంచ్ నిమ్మల రాజామణి-శ్రీనివాస్ చేతుల మీదుగా స్టీల్ ప్లేట్లను అందజేశారు. గ్రామంలో నిర్వహించే శుభకార్యాలకు వినియోగించుకునేందుకు వీలుగా స్టీల్ ప్లేట్లను సమకూర్చినట్లు సర్పంచ్ తెలిపారు.

యువతే దేశానికి ఆధారం



అక్షరటుడే, ఆర్మూర్ : యువతే దేశానికి కళ్లలాంటి వారని టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఓయూ జేఏసీ నేత రాజారామ్ యాదవ్ అన్నారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీకి దేశంలో విద్యార్థి యువత స్వతంత్రంగా ఉద్యమించడం ఇష్టం లేదన్నారు. బీజేపీ మోదీ యువత పోరాటాన్ని ఉక్కుపాదంతో అనిచివేస్తుంటే కాంగ్రెస్ విద్యార్థి, యువత ఉద్యమంలోకి చొరబడి దాని విశ్వసనీయతను దెబ్బ కొట్టాలని చూస్తున్నారన్నారు. ప్రగతిశీల, ప్రజాస్వామ్య, సామజిక ఉద్యమ శక్తులు కాంగ్రెస్ ట్రాప్‌లో పడొద్దని, విద్యార్థి, యువత పోరాటానికి అండగా ఉండాలన్నారు.



సోదరభావంతోనే ఐక్యత : ప్రబోధ్ సుమేర్


అక్షరటుడే, భీమ్‌గల్: కులమతాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా ఉంటూ మానవత్వం, సోదరభావానికి ప్రాధాన్యమివ్వాలని ఆల్ బ్రాహ్మణ ప్రోగ్రెస్సివ్ సొసైటీ (ఏబీపీఎస్) జాతీయ అధ్యక్షుడు ప్రబోధ్ సుమేర్ సూచించారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. దేవీ శరన్నవరాత్రులు, బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా భీమ్‌గల్ మండల ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటేనని, పరస్పర గౌరవం, ప్రేమ, నైతిక విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పండుగలు కేవలం ఆచారాలకే పరిమితం కాకుండా ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించేలా ఉండాలని ఆకాంక్షించారు. భీమ్‌గల్ ప్రాంతంలో రైతులు సాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నారని ప్రబోధ్ సుమేర్ ఆవేదన వ్యక్తం చేశారు.

పైవేట్ డీలర్లకు చేరుతున్న సొసైటీ బియ్యం!

అక్షరటుడే, కోటగిరి : సన్నబియ్యం ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. రెండు నెలల వ్యవధిలోనే రూ.1500కు పైగా ధరలు పెగడంతో సామాన్యుడు బెంబేలెత్తిపోతున్నాడు. ఎల్‌నినో ఎఫెక్ట్‌తో ధరలు పెరుగుతున్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే పోతంగల్ సొసైటీలో బియ్యం పక్కదారి పడుతోందనే ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయి.

పోతంగల్ సొసైటీలో..

పోతంగల్ పీఏసీఎస్ సొసైటీ పరిధిలోని బియ్యం దుకాణంలో బియ్యంకు భలే డిమాండ్ ఉంటుంది. ఇక్కడి బియ్యం ఖరీదు చేసి తినేందుకు ప్రజలు ఎక్కువగా ఇష్టపడుతుంటారు. కానీ ఇటీవల సొసైటీ బియ్యం క్షణాల్లోనే మాయమవుతున్నాయి. సాధారణ ప్రజలు బియ్యం అడిగితే నిబ్బంది లేవంటున్నారని.. కాని అవే బియ్యం బయట దుకాణాల్లో దొరుకుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. పోతంగల్ సొసైటీకి వచ్చిన బియ్యం వచ్చినవి వచ్చినట్లే వెళ్లిపోతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు.



భగ్గుమంటున్న ధరలు..

బహిరంగ మార్కెట్‌లో బియ్యం డీలర్ల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందని వారన్నారు. గతంలో హెచ్ఎంటీ బియ్యం రేటు రూ.4,600 ఉంటే ఇపుడు రూ.8,000కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. అలాగే జైశ్రీరామ్ బియ్యం రూ.5,000 ఉండేవని.. రూ.8,000, బీపీటీ రూ.4,400 ఇప్పుడు రూ.6,000 పలుకుతోంది. అయితే సొసైటీ బియ్యంపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. అధిక ధరల విక్రయాలయపై మండలంలోని దుకాణాల్లో తనిఖీలు చేయాలని కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి..



సొసైటీలో ఈ మధ్య బియ్యం పక్కదారి పడుతున్నట్లుగా తెలుస్తోంది. బియ్యం కొందామని ఎప్పుడు వెళ్లినా లేవు అనే సమాధానం వస్తోంది. అధికారులు సొసైటీలో బియ్యం డీలర్లకు చేరకుండా చర్యలు చేపట్టాలి. సామాన్యులకు అందుబాటులో ఉంచాలి.

– ముత్యం, పోతంగల్